మహానందీశా..ఏమిటీ దుస్థితి!

- మహానంది క్షేత్రానికి రూ.కోట్లలో ఆదాయం
- భక్తులకు సౌకర్యాలు అంతంతమాత్రమే
- అరకొరగా వసతి గృహాలు
- బురదమయంగా పరిసరాలు

మహానంది: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మహానంది ఒకటి. డిప్యూటీ కమిషనర్ స్థాయి హోదా కలిగిన మహానందికి ఏడాదికి ఆదాయం రూ. కోట్లలో వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇంత పెద్ద క్షేత్రంలోని ఆలయ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయనుకుంటే మాత్రం పొరపాటే. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కనీస వసతులు లేకపోగా ఆలయ పరిసరాలు బురదమయంగా మారడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. రూ.కోట్లు ఆదాయం వస్తుంటే కనీస వసతులు కల్పించలేరా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదికి రూ. 17కోట్లు ఆదాయం

మహానందీశుడికి ప్రతి ఏడాది రూ. 17కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. మహానందీశ్వర స్వామికి గత ఐదేళ్లలో ఆదాయం అమాంతంగా పెరిగింది. 2018–19 ఏడాదిలో రూ. 9.99 కోట్లు ఆదాయం రాగా 2023–24లో రూ. 17.50కోట్లకు చేరింది. అంటే ఐదేళ్లలో ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది. ఇంత మొత్తంలో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. భక్తులకు సరిపడా వసతి గృహాలు లేకపోవడంతో భక్తులు ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించాల్సి వస్తోంది. మహానందిలోని నాగనంది, టీటీడీ వసతి గృహాల్లో అన్ని కలిపి కేవలం 43 వరకు మాత్రమే గదులు ఉన్నాయి. ఉన్న గదుల్లోనూ లీకేజీ అవుతున్న కుళాయిలు, పగిలిపోయిన టాయిలెట్లే దర్శనమిస్తున్నాయి. వీటిని చూసిన భక్తులు చేసేదేమిలేక ధర తక్కువ ఉండటంతో ఉండిపోవాల్సి వస్తుంది.


ఆలయ పరిసరాల్లో పరిస్థితి


నాగనంది వసతి గృహాల వద్ద దుస్థితి

కార్యాలయం ఎదుటే కంపు

వర్షం వస్తే ఆలయ పరిసరాల్లోని నాగనంది వసతి గృహాలు, ప్రధాన కార్యాలయం, పోచా బ్రహ్మానంద రెడ్డి డార్మెటరీ, పాపిరెడ్డి కాటేజీల ముందు బురద నీరు నిలిచిపోవడంతో కంపు కంపుగా మారాయి. ఆలయాభివృద్ధికి ప్రణాళికలు, మాస్టర్‌ప్లాన్ అంటూ ప్రకటనలు చేస్తున్న అధికారులకు ఆలయ పరిసరాల్లోని బురద కనిపించడం లేదా అంటూ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాగనంది వసతి గృహాల ముందు నెలల తరబడి నీళ్లు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడ అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. అయితే ఇక్కడి పరిసరాలను చూసి విసుగు చెందుతున్నారు.

అయ్యప్ప స్వాముల అవస్థలు

ప్రస్తుతం మహానంది ఆలయానికి అయ్యప్పదీక్ష స్వాములు వేలాది సంఖ్యలో వస్తున్నారు. అయ్యప్పలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఏర్పాటు చేసుకునే భిక్ష (ఫలహార, భోజనాలు) తయారు చేసుకునేందుకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఆలయ పరిసరాల్లో బురద ఉండటంతో రోడ్లపైనే వండుకుంటున్నారు. ఇటీవల మహానంది ఈఓగా బాధ్యతలు స్వీకరించిన నల్లకాలువ శ్రీనివాసరెడ్డిని స్థానికులు కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయ పరిసరాల్లో బురదను తొలగించి, గుంతలను చదును చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తాం



మహానంది ఆలయ పరిసరాల్లో బురద తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. వర్షం పడినప్పుడు నీరు నిలుస్తూ ఉంటుంది. నీరు నిలువ లేకుండా చేస్తాం. వెంటనే ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి చెప్పి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వసతి గృహాల్లోని కుళాయిలకు మరమ్మతులు చేసేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశాం. వాటికి మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించాం. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

– నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఈఓ, మహానంది

క్లుప్తంగా

మహానందిలో అయ్యప్పల సందడి


ఆలయ మాడవీధుల్లో అయ్యప్పలు

మహానంది: మహానంది ఆలయంలో శనివారం రాత్రి నుంచి అయ్యప్ప దీక్షా స్వాముల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో అయ్యప్పలు తరలివచ్చారు. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. సుమారు వందకు పైగా బస్సుల్లో అయ్యప్పలు తరలి వచ్చారు. బస్సుల వద్ద స్వామియే...అయ్యప్పో, స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటూ స్వామి నామస్మరణ మారుమోగింది. అనంతరం మహానందిశ్వర స్వామిని దర్శించుకొని భక్తిశ్రద్ధలలో పూజలు చేపట్టారు.

పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని ప్రభుత్వ బాలుర సంక్షేమ హాస్టల్‌ను ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు లక్ష్మయ్య, స్థానిక నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులను కోరారు. శ్రీశైలంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో వార్డెన్, పిల్లలకు వడ్డించిన మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించమన్నారు. భోజనం సంతృప్తికరంగా ఉందని, అన్ని హాస్టల్లో కూడా నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని, మెనూ ప్రకారం అందేలా చూడాలని సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

కాలభైరవుడికి అభిషేకార్చనలు


పూజలందుకున్న కాలభైరవ స్వామి

మహానంది: నవనందుల్లో ఒకటిగా విరాజిల్లుతున్న సూర్యనంది క్షేత్రంలో కొలువైన శ్రీ కాలభైరవ స్వామికి కాలభైరవాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ శర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కాలభైరవ స్వామికి పంచామృత అభిషేకం, మహా మంగళ హారతులు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేక, అర్చనలు జరిపారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు


నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ, పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు విక్రయించినా, తయాలరు చేసినా చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని నీలిషికారిపేటలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను ఎస్‌ఐలు చంద్రశేఖర్, సురేష్‌బాబు, ఓబులేసు, పోలీసులు ధ్వంసం చేశారు. 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు.

దెబ్బతిన్న పశుగ్రాసం


వీరాపురం సమీపంలో దెబ్బతిన్న వరిగడ్డి


కొత్తపల్లి: మండలంలో గువ్వలకుంట్ల, బండి నాయిని పాలెం, వీరాపురం, శివపురం, గుమ్మడాపురం, బావాపురం, నందికుంట గ్రామాలతో పాటు మండల కేంద్రమైన కొత్తపల్లిలో రైతులు 1,092 హెక్టార్లలో వరిని సాగుచేశారు. పంటల కాలం పూర్తికావడంతో వరికోతలు రైతులు మొదలు పెట్టారు. ఇంకా కోతలు పూర్తి కాకముందే మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లోని పశుగ్రాసం కాస్తా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడడంతో పశుగ్రాసం నాని కుల్లిపోయే స్థితికి చేరుకుంది. ఈ పశుగ్రాసాన్ని పశువులుకూడా తినేందుకు పనికి రాదని రైతులు వాపోతున్నారు. ఫెంగల్ తుపాన్ కారణంగా ధాన్యం దెబ్బతినడంతో పాటు పశువుల నోటికాడి గడ్డి కూడా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మూలన చేరిన ప్రచార బోర్డులు


ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బోర్డులు

జూపాడుబంగ్లా: ప్రజల ఆరోగ్యం ఏమైతే మాకేంటి...వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం మాకేంటి.. ప్రచార బోర్డులు ఇస్తే ఏర్పాటు చేయాలా...అనే నిర్లక్ష్య ధోరణిలో జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్యసిబ్బంది వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణ, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం అంటూ ప్రచారపు బోర్డులను ప్రభుత్వం జూపాడు బంగ్లా ప్రాథమిక కేంద్రానికి మంజూరు చేసింది. వాటిని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన వైద్యులు, వైద్య సిబ్బంది వాటిని ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా మూలనపడేయడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే వాతావరణ మార్పు–ప్రజారోగ్యంపై అవగాహన బోర్డులను కూడా మూలన పెట్టేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకొని ఆయా బోర్డులను ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలుగుగంగ కాల్వకు నీటిసరఫరా నిలిపివేత


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి తగ్గించిన నీటిసరఫరా

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ రెండు గేట్ల ద్వారా కేవలం 1,500క్యూసెక్కుల నీటిని మాత్రమే ఎస్సార్బీసీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. తెలుగుగంగ కాల్వకు నీటిసరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. సాయంత్రం శ్రీశైలం డ్యాంలో 864 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 863అడుగులు ఉన్నట్లు తెలిపారు. బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి, ఎస్సార్బీసీ(జీఎన్‌ఎస్‌ఎస్) కాల్వకు 500క్యూసెక్కుల చొప్పున సరఫరా విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఇప్పటిదాకా దిగువ ప్రాంతాలకు 197టీఎంసీల నీటిని సరఫరా చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

టార్పాలిన్ కప్పకుండానే ఇసుక, కంకర తరలింపు


టార్పిలిన్, గ్రీన్‌మ్యాట్ కప్పకోకుండా ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్లు

జూపాడుబంగ్లా: ఇసుక, కంకర, గ్రావెల్ తరలించే టిప్పర్లపై తప్పనిసరిగా గ్రీన్‌మ్యాట్ లేక టార్పిలిన్ పట్టాకప్పి తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అయినా డ్రైవర్లు ఎలాంటి మ్యాట్, టార్పిలిన్ పట్టాలు కప్పుకోకుండా కర్నూలు–గుంటూరు రహదారిపై నిత్యం పదులసంఖ్యలో టిప్పర్లను తిప్పుతున్నారు. దీంతో వాహనాలు వెళ్లినంత దూరం రోడ్డు వెంట ఇసుక, కంకర, గ్రావెల్ పడుతుంది. వెనుక వచ్చే ద్విచక్రవాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. కళ్లల్లో ఇసుక, గ్రావెల్, కంకర దస్సు పడ్డుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. చీటికి మాటికి వాహనాలను నిలిపి జరిమానాలు విధించే ఆర్టీఓ అధికారులు, పోలీసులకు ఇలాంటి టిప్పర్లు కనిపించవా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్త


తిమ్మాపురంలో రోడ్డు పక్కనే చెత్త ఉన్న దృశ్యం

తడి చెత్త, పొడి చెత్త సేకరించి డంప్‌యార్డులకు, చెత్త సేకరణ కేంద్రాలకు తరలిస్తున్నామంటూ అధికారులు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. కానీ మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ప్రధాన వీధుల్లో రోడ్డు పక్కనే చెత్తను వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతుండటంతో దారిన వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పక్కనే ఉన్న చెత్తను తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

–మహానంది

దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలి


దూదేకుల సంఘం నాయకులు మస్తానయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: దూదేకులు అన్ని రంగాల్లో రాణించాలని దూదేకుల సంఘం జాతీయ అధ్యక్షుడు షేక్ సత్తార్‌సాహెబ్, జాతీయ నాయకులు కల్లూరి మస్తానయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దూదేకులు అభివృద్ధి చెందడంలో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఇందుకు దూదేకుల సంఘానికి కార్పొరేషన్ ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమకూర్చి, వారి అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. దూదేకుల కులస్తులను దళిత ముస్లింలు పరిగణించి ఎస్సీ జాబితాలో కలపాలని కోరారు. అంతకముందు ఆ సంఘం జాతీయ నాయకులు మస్తానయ్యను దుశ్శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నూర్‌బాషా, సుంకేసుల ఖాదర్ బాషా, సిద్ధయ్య, కన్నయ్య, అబ్దుల్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు పట్టణంలో జరిగిన దూదేకుల సంఘం కార్యకర్తల సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సాహెబ్, కో–కన్వీనర్‌గా మాలిక్, ఖాజాహుసేన్, డి.మౌలాలి, చాంద్‌బాషా, ఇస్మాయిల్, మల్లయ్యస్వామితో పాటు ఆ సంఘం పెద్దస్వాములను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- బాధితులకు అండగా నిలువాలి
- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్


రికార్డులను పరిశీలిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

పగిడ్యాల: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజల మన్ననలు పొందాలని డీఎస్పీ రామాంజినాయక్ పోలీసులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుల సమస్యలను ఓపిగ్గా తెలుసుకుని అండగా నిలువాలని చెప్పారు. మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఆదివారం డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన డీఎస్పీ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌ఐకి సూచించారు. స్టేషన్‌లో నిర్వహించే 41 రికార్డ్స్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డే బీట్, నైట్ బీట్, పల్లె నిద్ర, నాకా బందీ, విలేజ్ విజిట్స్‌ను రెగ్యూలర్‌గా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఘర్షణలకు పాల్పడినా, ప్రోత్సహించినా సహించమని, ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు. కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజిన్ బోట్ల ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇంకా నిషేధిత వలలు లాగితే మత్స్యకారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామాంజినాయక్ హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారనే విమర్శలు వస్తున్న విషయాన్ని సాక్షి విలేకరి డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమీ లేదన్నారు. తాము చట్టపరిధిలో వ్యవహరిస్తున్నామని, ఎవ్వరిపై కేసులు నమోదు చేయలేదన్నారు. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు వచ్చినా చట్టపరిధిలోనే ఉంటామని, వాస్తవాల మేరకు బాధితులకు న్యాయం చేస్తామన్నారు. డీఎస్పీ వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్‌ఐలు కృష్ణుడు, సుబ్బరావు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెంచు గిరిజనుల సమస్యల పరిష్కార వేదిక వాయిదా

శ్రీశైలంప్రాజెక్ట్: సోమవారం జరుగవలసిన చెంచుగిరిజనుల ప్రజాసమస్యల పరిష్కారవేదిక వాయిదా వేసినట్లు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.వెంకటశివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 11వ తేదీన ఐటీడీఏ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన గిరిజన నాయకులు, చెంచు గిరిజనులు గమనించాలన్నారు.

రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

కొత్తపల్లి: ఉద్యాన పంటలు మామిడి, ఉల్లికి వాతావరణ ఆధారిత బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధికారి కె.చందన సూచించారు. ఆదివారం మండల కేంద్రం కొత్తపల్లిలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఉద్యాన వన పంటలు సాగుచేసిన రైతులకు పంటనష్టం జరిగినపుడు పరిహారం పొందేందుకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. వాతావరణంలో వచ్చే మార్పుల వలన పంటనష్టం జరిగితే కేంద్రప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ద్వారా వాతావరణ ఆధారిత ఉద్యాన పంటలకు బీమాను అందిస్తుందన్నారు. అందుకోసం మామిడికి ఎకరాకు రూ.2250 చెల్లిస్తే రూ.45,000, ఉల్లి పంటకు ఎకరానికి రూ.90 ప్రీమియం చెల్లిస్తే రూ.45,000 పంట బీమా వర్తిప చేస్తుందని తెలిపారు. ఈ ప్రీమియం మొత్తాన్ని రైతులు ఈనెల 15 తేదీలోపు చెల్లించాలని సూచించారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, ఆళ్లగడ్డ కార్యదర్శి ధనలక్ష్మి, నాయకులు రామకృష్ణ, రాము, శివమ్మ, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మాజీ సైనికుల కార్యాలయంలో ఆదివారం డివిజన్‌స్థాయి యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. ప్రభుదాసు ప్యానల్‌పై రంగనాయకులు ప్యానల్ ఘన విజయం సాధించింది. అధ్యక్షుడిగా చిన్న రంగనాయకులు, ఉపాధ్యక్షుడిగా రామరాజు, సెక్రటరీగా గురువయ్య, ట్రెజరర్‌గా జయరావు ఎన్నికయ్యారు. చిన్న రంగనాయకులు మాట్లాడుతూ నంద్యాలలో మిలటరీ క్యాంటిన్ ఏర్పాటుకు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు


నందికొట్కూరు: మున్సిపల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సర్వర్‌ఖాన్, పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కార్మికులు వినతి పత్రం అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన విధంగా ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే కార్మికులకు పెంచాలని కోరారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ సుబ్బయ్య, చాంద్‌బాషా, నాగరాజు, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, శ్రీరాములు, ఇబ్రహీం, మస్తాన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రాంగణంలో ఉచిత కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న కర్నూలు జయలక్ష్మి వైద్యశాల డాక్టర్లు

నందికొట్కూరు: క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని పట్టణంలోని టౌన్ సీఎస్‌ఐ చర్చి ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఎస్‌ఐ టౌన్ చర్చి సంఘం మాజీ సెక్రటరీ, మండల పరిధిలోని కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ స్వామిదాసుగారి రవికుమార్ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని రెవరెండ్ శామ్యూల్ రత్నరాజ్, మోహన్‌రాజుగాంధీ, చర్చి సెక్రటరీ జాన్ క్రిసోస్టమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ టౌన్ చర్చి కోశాధికారి జయచంద్ర, కమిటీ సభ్యులు రవిజయప్రకాష్, ఫ్రాన్సిస్, ప్రదీప్, స్త్రీల మైత్రి సభ్యులు దేవకుమారి, ఏసుపాదమ్మ, సువర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం


అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం చేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీస్వామి అయ్యప్ప దేవస్థానం 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు జరిపించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ చండీ, హోమాలు పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా చేపట్టి మహాపూర్ణాహుతి గావించారు. సాయంత్రం ఆయుధ పూజా నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే మూలవిరాట్‌కు పుష్పాభిషేకం చేయించారు. మహామంగళ హారతులు ఇచ్చి ప్రసాద వితరణ గావించారు. అయ్యప్ప సేవా సమాజ్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, శ్రీకాంత్, గంగాధర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.


చండీ హోమం పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు

దొర్నిపాడు: ఇళ్ల వద్ద పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వద్దని ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వాడకం వల్ల మానసికంగా ఇబ్బందులు వస్తాయన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడబడితే అక్కడ బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికం అవుతున్నాయన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

లలితా బజార్ షాపుల కేటాయింపులో అవకతవకలు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని లలితా బజార్‌లోని క్యూ, ఆర్ లైన్లో ఉన్న షాపుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓకు, దేవాదాయ కమిషనర్‌కు, ఎన్డీఏ కూటమి పెద్దలకు లేఖలను రాసినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగినందున ఈ రెండు బ్లాక్‌లలో వ్యాపారులు కొందరు దుకాణాలు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై దేవస్థానం ఈఓ దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

భారీగా పోలీసుల బదిలీ

బండి ఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి భారీగా పోలీసులు బదిలీ అయ్యారని ఎస్.ఐ. జగన్ మోహన్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్ నుంచి ఇద్దరు ఏఎస్‌ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది కానిస్టేబుళ్ల వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారన్నారు. వీరి స్థానంలో కొత్త సిబ్బంది త్వరలోనే వస్తారని వెల్లడించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

శ్రీశైలంప్రాజెక్ట్: సీపీఎం నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ మునిపాటి చిన్నమారెన్న, అధ్యక్షుడు దర్శనం నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సున్నిపెంటలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాలలో ఈనెల 9, 10వ తేదీలలో జరిగే మహాసభలకు కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు, రైతులు, మేధావులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.మల్లికార్జున, నాగ వెంకటేశ్వర్లు, పోలయ్య, రంగస్వామి, వెంకటస్వామి, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.